క్లుప్తంగా

చేగూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు

నందిగామ: మండల పరిధిలోని చేగూరు శివారులో హజరత్ నిజాం షాహిద్ ఉర్సు షరీఫ్ దర్గాను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి గురువారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. హిందూ ముస్లింలు ఐక్యతతో ఉండి ప్రతి ఏటా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, అశోక్, బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న అజీజ్‌నగర్ గ్రామస్తులు, నాయకులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు యువకులు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో గల మున్సిపల్ పురపాలక సంఘం కార్యాలయంలో అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన నాయకులు, గ్రామస్తులు ఆయనను కలిసి సన్మానించారు. గ్రామంలో ఉన్న సమస్యలను కమిషనర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి అందరూ సహకరిస్తే మున్సిపాలిటీ ఆదర్శంగా మారుతుందన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయా లని సూచించారు. మున్సిపాలిటీలో అన్ని గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ వార్డు సభ్యురాలు సుధాశ్రీధర్, హరిబాబు, చిరంజీవి, సుధీర్, ప్రవీణ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి

మొయినాబాద్: రక్తదానం చేయడం ఇతరులకు ప్రాణదానం చేయడమేనని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలన్నారు. రక్తదానం చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. ఈ శిబిరంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎంఎన్ నర్సయ్య, డీఎస్ డీన్ ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రత్నాచారి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

చేవెళ్ల: గ్రామంలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలో రూ.15లక్షల ఎన్ఆర్ఈజీఆర్ఎస్ నిధులతో వేస్తున్న సీసీరోడ్డు పనులను గ్రామ నాయులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కృషితో గ్రామాభివృద్ధికి నిధులు తీసుకొస్తానని, అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

‘మీ సేవ’ కష్టాలు

మండలంలో ఒకటే కేంద్రం.. నాలుగేళ్ల క్రితం ఒకటి సీజ్

- నిర్వాహకుడు మరణించడంతో మరొకటి మూత
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



రెడ్డిపల్లిలో మీసేవ కేంద్రం

మొయినాబాద్: ప్రస్తుతం ఏ దరఖాస్తు చేసుకోవాలన్నా ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలి. ఆన్‌లైన్ సేవల కోసం ప్రతి 5వేల జనాభాకు ఒక మీ సేవ కేంద్రం ఉండాలి. కానీ మొయినాబాద్ మండలంలో 70 వేల జనాభాకు ఒకటే కేంద్రం ఉంది. సుమారు నాలుగు సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు సంవత్సరాలుగా..

మొయినాబాద్ మండల ప్రజలకు మీసేవ కష్టాలు తీరడం లేదు. సుమారు నాలుగు సంవ్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ మొత్తానికి ఒకటే కొనసాగుతుండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మొయినాబాద్ మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు నాలుగు సంవత్సరాల క్రితమే మూతబడ్డాయి. నాలుగున్నర సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదేవిధంగా నాలుగేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. దీంతో మండల ప్రజలు తప్పనిసరిగా రెడ్డిపల్లి మీసేవ కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది.

నోటిఫికేషన్ ఇచ్చినా..

నాలుగున్నరేళ్ల క్రితం నిర్వాహకుడి మరణంతో మూతబడ్డ హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. మీసేవ నిర్వాహణకు దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో మండలంలోని చాలా మంది దరఖాస్తు చేసుకొని పరీక్ష సైతం రాశారు. అయితే ఈ కేంద్రాన్ని స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించారని పరీక్ష రాసిన కొంత మంది తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఇవ్వడం లేదు. మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీజ్ చేయడంతో నిర్వాహకుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చాడు. దీంతో మొయినాబాద్‌లో కేంద్రం నిర్వహించేందుకు స్టే అడ్డంకిగా మారింది.

తప్పని ఇబ్బందులు..

ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరు మీసేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ కేంద్రం వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకే మీసేవ కేంద్రం ఉండడం.. అందరూ అక్కడికే వెళ్లడం.. ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుండడంతో వచ్చినవారు అసహనానికి గురవుతున్నారు. కొంత మంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మొయినాబాద్ మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అది కూడా రెడ్డిపల్లిలో ఉండటంతో చాలా గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న మీసేవ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు కృషి చేయాలి. మండలంలో మరికొన్ని కొత్త కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలి.

– వి.శ్రీనివాస్, అప్పారెడ్డిగూడ, మొయినాబాద్

ప్రతిపాదనలు పంపాం



మొయినాబాద్ మండలంలో ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మండలంలో కొత్తగా మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాయక్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేపై బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అర్థం లేని ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించి షాద్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం తగదన్నారు. షాద్‌నగర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు విష్ణువర్ధన్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలతో జతకట్టిన ఆయన ఎవరి తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్నారో బీజేపీ నేతలు గ్రహించాలన్నారు. నిధుల విడుదల విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేను గ్రామాల్లో తిరగనియ్యం అని హెచ్చరించడం తగదన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఏ గ్రామానికి వెళ్లేందుకైనా తాము సిద్ధమన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని ఎంపీ డీకే అరుణ ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, ఇబ్రహీం, హరినాథ్‌రెడ్డి, సీతారాం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు



మల్లన్నస్వామి దేవాలయం

- నూతన దేవాలయంలో మూడురోజులపాటు పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న దేవాలయంలో 7వ తేదీ శుక్రవారం నుంచి పూజా కార్యకమాలు ప్రారంభం కానున్నట్లు యాదవ కమిటీ సభ్యులు బండారి కుమార్‌యాదవ్, చౌదరి సిద్దయ్య యాదవ్, మాజీసర్పంచ్ పెద్దగొల్ల రాజేందర్‌యాదవ్ తెలిపారు. గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమై స్వామివారి విగ్రహాలు, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8వ తేదీ శనివారం మాగ భౌల ఏకాదశి రోజు వాస్తుహోమం తదితర పూజలు జరుగుతాయని తెలిపారు. 9వ తేదీ ఆదివారం ధన్వంత పూజ, వేదపూజ, నవరత్న స్థాపన, మంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తామని, అనంతరం మల్లన్నకు బోనాలు, ఊరేగింపు ఉంటాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నప్రసాదం ఉంటుందని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ఎక్కువ మొత్తంలో నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి గాను పంచాయతీరాజ్ శాఖ నుంచి ఐదు మండలాలకు సంబంధించి 196 పనులకు గాను 10కోట్ల 40లక్షల రూపాయల సీఆర్ఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు మండలాల వారీగా నవాబుపేట మండలంలో 24 పనులు, చేవెళ్ల మండలంలోని 39 పనులు, మొయినాబాద్ 49, షాబాద్ 39, శంకర్‌పల్లి 45 పనులకు గాను నిధులు విడుదలైనట్లు, వీటితో గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి సీతక్క చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, నాయకులు షాబాద్ దర్శన్, ఆగిరెడ్డి, రాంరెడ్డి, సురేందర్, శ్రీనివాస్, నరేందర్, కృష్ణాగౌడ్, రాములు, నరేందర్, రాంచంద్రయ్య, ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాల్లో హుందాతనం నేర్చుకోండి

బీజేపీ యువ నాయకుడు కుమ్మరి మహేశ్

కేశంపేట: కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి గురించి ఆలోచించకుండా, వారు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తున్నందుకు హుందాతనం లేకుండా విమర్శలు చేస్తున్నారని బీజేపీ యువ నాయకుడు కుమ్మరి మహేశ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు విమర్శించడంపై మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారని, వాటికి సమాధానం లేకుండా నిందలు వేస్తూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన సొంత నిధులతో ప్రజలకు సేవ చేశారని, నిత్యం ప్రజల్లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు తొమ్మిదిరేకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి

ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొందుర్గు: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. తాగునీటి సరఫరా పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో వెంటనే ఉపాధి పనులను ప్రారంభించాలని సూచించి, కూలీలందరికీ విధిగా పని కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన పన్నులను నిర్ణీత గడువులోగా వసూల్ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ లాలయ్య, ఏపీఓ నర్సింగ్‌రావుతో పాటు ఉపాధిహామీ టీఏలు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భోజన పథకం నుంచి మినహాయించాలి

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ప్రధానోధ్యాయులు కోరారు. గురువారం మండల విద్యాధికారి హీర్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. భోజన పథకంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విన్నవించినట్లు పీఆర్టీయూ మండ ల అధ్యక్షుడు పరమేశ్, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌లు తెలిపారు.

బస్‌షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభం



జేసీబీతో పనులు చేయిస్తున్న మాజీ ఎంపీటీసీ కృష్ణ

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ తన సొంత డబ్బుతో బస్‌షెల్టర్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్ము కృష్ణ మాట్లాడుతూ.. గతంలో రోడ్డు విస్తరణ చేపట్టిన సమయంలో బస్‌షెల్టర్‌ను తొలగించారని, నాటి నుంచి నేటివరకు ప్రయాణికులకు నిలువ నీడ కరువైందని, దీంతో పాటు వర్షాకాలంలో సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. తన సొంత డబ్బులు సుమారు రూ.1లక్ష వ్యయంతో బస్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీంతో దాత కొమ్ము కృష్ణను గ్రామస్తులు, ప్రయాణికులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జంగారి రాములు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్లు 1) గడ్డం రంగయ్య తండ్రి లేటు గడ్డం గందయ్య, నివాసం: 2-88, శివాలయం రోడ్, వట్టినాగులపల్లి గ్రామం, గండిపేట్ మండలం, ఆర్ఆర్ జిల్లా, 2) గడ్డం మల్లేష్ యాదవ్ తండ్రి లేటు గడ్డం పెంటయ్య యాదవ్, నివాసం: ఇ.నెం.13-6-438/143/1, ప్లాట్ నం.201, ప్లాట్ నం.194, స్ట్రీట్ నం.5, సత్యనారాయణ నగర్ కాలనీ, రేణుక మాత దేవాలయం, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, హైదరాబాద్ వారు రంగారెడ్డి జిల్లా, గండిపేట్ మండలం, వట్టినాగులపల్లి గ్రామం వద్ద గల సర్వే నం.71లోని ఎ.0-24 1/2 గుంటల విస్తీర్ణం గల తమ భూమికి సంబంధించి M/s సాయి సూర్య డెవలపర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు K. సతీష్ చంద్ర గుప్త, తండ్రి K. సుబ్బారావు, వయసు: 60 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఫ్లాట్ నం.202, 2వ అంతస్తు, హెరిటేజ్ ఫ్రెష్ పైన, ఇ.నెం.8-3-191/67, వెంగళరావునగర్, హైదరాబాద్ - 38 తో 29-6-2019 తేదీనాడు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారని ఇందుమూలంగా సాధారణ ప్రజలందరికీ తెలియజేయడమైనది. సదరు సాయి సూర్య డెవలపర్స్ అమ్మక ఒప్పందం యొక్క నియమ నిబంధనలు నెరవేర్చుటలో విఫలమైనారు మరియు నా క్లయింట్లకు మిగిలిన మొత్తం చెల్లించలేదు. అందువలన నా క్లయింట్లు సదరు అమ్మక ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. సదరు సాయి సూర్య డెవలపర్స్ నా క్లయింట్ల భూమిలో వెంచర్ అనగా సామవేద ఎన్‌క్లేవ్ వేసారు. అందువలన సర్వే నం.71లోని ప్లాట్లను (ప్లాట్ నం.లు 12 నుండి 21) ఎవరూ కొనుగోలు మరియు ఇతరేతర లావాదేవీలు చేయరాదు. ఈ నోటీసు తరువాత కూడా ఎవరైనా ప్లాట్లను కొనుగోలు చేస్తే అవి వారి స్వంత నష్టపూచీ, వ్యయాలపై చేసినట్లవుతుంది మరియు నా క్లయింట్లు సదరు డాక్యుమెంట్లను రద్దు చేస్తారు. అందువలన ఈ హెచ్చరిక ప్రకటన జారీ చేయనైనది.

సం/- **శశికాంత్ తివారి,** న్యాయవాది
#9-1-184, స్ట్రీట్ నం.3, తివారీస్ హనుమాన్ టెంపుల్ దగ్గర, లలితా నగర్, లంగర్‌హౌస్, హైదరాబాద్ - 500008. తెలంగాణ. సెల్ నం.9849236974.

శివస్వాములకు అన్నదానం

మతసామరస్యాన్ని చాటిన ముస్లింలు



శివస్వాములకు అన్నదానం చేస్తున్న ముస్లింలు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో గురువారం శివస్వాములకు ముస్లింలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో బంటారం రాజుగౌడ్, అలుగొండ శ్రీనయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు శివమాలలు వేసుకున్నారు. వీరందరూ గ్రామంలోని శివాలయంలో సన్నిధానం ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం గ్రామానికి చెందిన ఎండీ మహ్మద్, సల్వార్, అఫీజ్, జహంగీర్ బాబా, ఇమ్రాన్ శివస్వాములకు అన్నదానం ఏర్పాటు చేసి, మతసామరస్యం పెంపొందేందుకు కృషిచేశారు. కులమతాలకతీతంగా అందరూ కలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మనోహర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, శేఖర్, గణేశ్, శివస్వాములు మహేశ్, శివ, అశోక్, శ్రీకాంత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

- ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్, రూరల్: నులి పురుగుల నివారణకు చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీఓ సంధ్య పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిబ్రవరి 10న అన్ని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఈ మాత్రలు వేయాలని సూచించారు. అక్కడ వేయించని వారికి తిరిగి 17న ఇవ్వాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యాధికారి నుంచి ఆశ సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. చిన్నారులకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అల్బెండజోన్ మాత్రల వాడకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిషన్‌రావు, వైద్యాధికారి అన్నపూర్ణ, ఎంఈఓ వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

శాస్త్ర పాఠశాల ఘటన బాధాకరం



మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

- విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపండి
- ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శాస్త్ర పాఠశాలలో విద్యార్థి నీరజ్ మరణం బాధాకరమని ఎంఈఓ మనోహర్ అన్నారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో పట్టణంలో కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఎంఈఓ మనోహర్ సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థి నీరజ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజామాన్యాలు విద్యార్థులతో మానసికోల్లాసాన్ని కలిగించే కార్యక్రమాలను చేయించాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలను చేపట్టడంతో పాటు యోగా, కరాటే వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులలో మనోధైర్యం నింపేందుకు మానసిక నిపుణులతో మోటివేషన్(ప్రేరణ) తరగతులను నిర్వహించాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులతో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో అపార్ కార్డు జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రాజేంద్రప్రసాద్, డీవీఎస్.స్వామి, థామస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగలింగం, ఇందిర డానియల్, రఫత్‌సుల్తానా, మధు, తదితరులు పాల్గొన్నారు.